# సంరక్షక గృహంలో రాణి

చిన్నతనంనుంచి రాణికి బొంబాయి మహాపట్నం చూడాలని పెద్ద కోరిక. చిన్నతనంలో తన పిన తండ్రి బొంబాయిలో వుండేవాడు. ఎప్పుడూ అతను బొంబాయి గురించి వర్ణిస్తూ చెబుతూ వుంటే, తను కళ్లు అంతవి చేసుకుని వింటూ కూచునేది. అక్కడి అరేబియా సముద్రం, పెద్దపెద్ద భవనాలు, రకరకాల వస్తువులు, పేవ్‌మెంట్ బజార్లూ వాటి గురించి చెబుతూ వుంటే, రాణికి ఎంతో ఆసక్తికరంగా వుండేది.

రాణి పెద్దదయింది; ఆమెకి పెళ్లి కూడా అయింది. కాని, ఆ బొంబాయి కోరిక మాత్రం అలాగే వుండిపోయింది. ఆ కోరిక తీరేక్షణం కోసం ఆమె ఎదురు చూస్తూ వుండగా, ఒక అవకాశం వచ్చింది. తన మిత్రురాలు ఒకామె బొంబాయి బయల్దేరుతున్నది. ఆమెతో కలిసి నేనూ వెళ్తే? – వెళ్లొచ్చు. కాని, భర్త, తలిదండ్రులూ అంగీకరించరే! వాళ్ళతో చెప్పకుండా వెళ్ళవలసిందేగాని, తనకు గత్యంతరం లేదు. లేకపోతే, ఎక్కడో దక్షిణ దేశంలోని కుంభకోణంలో వున్న తను, ఉత్తరాది బొంబాయిని ఎలా చూడగలుగుతుంది?—

ఆమె ఆలోచించింది.

రాణి తన తలిదండ్రులకు ఒక్కతే సంతానం. తండ్రి కరుప్పన్ అనే అతను. వ్యవసాయం చేసుకుంటూ వుంటాడు. అతని భార్య రామాయి కూడా అతనికి చేదోడు వాదోడుగా వుంటూ వుంటుంది. ఒక్కతే బిడ్డ. అందులోనూ ఆడపిల్ల – కావడం వల్ల తలిదండ్రులు రాణిని అతి గారాబంగా పెంచారు. తలిదండ్రులిద్దరూ పనిపాటలకి వెళ్లిపోతే – రాణి దర్జాగా తనకి కావలసినవి కొనుక్కుంటూ, ఆడుతూ పాడుతూ తిరిగేది. ఆమెను ఎవరూ అడ్డుపెట్టేవారు కాదు. ఆమె ఆడింది ఆట, పాడింది పాట.

పద్నాలుగో ఏటనే రాణికి 'ప్రేమ' తెలిసిపోయింది. రాజు అనే ఒకబ్బాయి, ఆమె ప్రేమించుకున్నారు. ఆ ప్రేమ అంతటితో ఆగిపోలేదు. తలిదండ్రులకు చెప్పకుండా ఇద్దరూ కలిసి, పక్కనున్న ఒక పల్లెకు పారిపోయి 'పెళ్లి' చేసేసుకున్నారు. కాని, రాణికి కొన్నాళ్ళకి మొహం మొత్తింది. రాజుతో జీవితం అంత ఆనందంగా కనిపించలేదు. అలాంటి సమయంలో ఆమెకి రాధ అనే అమ్మాయి కలిసింది. రాధ కబుర్లు రాణికి బాగా నచ్చాయి. జీవితం హాయిగా సుఖసంతోషాలతో గడపడానికి తాను నిశ్చయించుకున్నట్టు, అందుకని బొంబాయి వెళ్లిపోతున్నట్టూ రాధ చెప్పగానే — ఎప్పట్నుంచో బొంబాయి కలలుకంటున్న రాణి — ఎగిరి గంతేసి, తనూ వస్తానంది. ఇద్దరూ ఒక 'శుభ ముహూర్తం' చూసుకుని, బొంబాయి పట్నం వెళ్ళడానికి నిర్ణయించుకున్నారు.

వాళ్ళ దగ్గర వున్న కాస్త డబ్బుతో వాళ్ళ పల్లె వదిలి, బస్సుమీద మద్రాసు చేరుకున్నారు. మద్రాసులో దిగుతూనే, సెంట్రల్ స్టేషన్ కనుక్కొని, బొంబాయి వెళ్ళే బండికోసం ఎదురుచూడసాగారు. బొంబాయి బండి ఫలానా అని తెలుసుకుని, టిక్కెట్లు కొనకుండా, ఆ విషయమై ఆలోచించకుండా — స్త్రీల పెట్టెలో ఎక్కిపోయారు. ఎవరైనా టిక్కెట్లకోసం అడిగితే, పెద్ద 'నాటకం' ఆడి దాటేద్దాం అనికూడా అనుకున్నారు. అయితే, ఎలాగో మొత్తానికి ఏ టిక్కెట్టు కలెక్టరూ వీళ్ళ కంటబడలేదు!

ఏ బాధా బాదరబందీ లేకుండా, క్షేమంగా బొంబాయి స్టేషన్‌లో రాధ, రాణి ఇద్దరూ దిగారు. అయితే, దిగీదిగడమే వాళ్ళకి అంతా గంద్రగోళంగా కనిపించింది. వాళ్లు మాట్లాడుతున్న భాషలేవీ, తమకు తెలీవు. అందరూ హడావిడిగా, కంగారు కంగారుగా తిరుగుతున్నారు. ఎవర్ని అడగాలి? ఎలా వెళ్ళాలి? ఎక్కడికి వెళ్ళాలి? అంతా అగమ్యం! ఎక్కడి కుంభకోణం! ఎక్కడి బొంబాయి!!

ఎలాగోలా బయట పడి, పట్టణం వాతావరణాన్ని చూస్తూ దిగ్గున వుండి పోయారు. వాళ్ళిద్దరూ తమిళంలో మాట్లాడుకోడం గమనించిన ఒక ఆవిడ – వాళ్ళని తమిళంలో పలకరించి, వాళ్ళ సంగతేమిటని అడిగింది. తమ మాట వినగానే, ఇద్దరికీ ప్రాణం లేచి వచ్చింది. నదిలో కొట్టుకుపోతున్న వాళ్ళకి, పడవ కనిపించినంత ఆనందంగా, ఇద్దరూ తమ విషయం చెప్పారు. తమ దగ్గర డబ్బు కూడా ఆట్టేలేదనీ, ఎక్కడికి వెళ్ళాలో కూడా తెలీదనీ చెప్పారు. ఆమె వాళ్ళని చూసి, చాలా జాలి పడింది. "మీకేం భయం లేదు. నేను మా యింటికి తీసుకెళ్తాను. అక్కడ వుండి, బొంబాయి పట్టణం అంతా తిరిగి వద్దురుగాని!" అంది. వాళ్ళకి చెప్పలేనంత ఆనందం కలిగింది. ఇద్దర్నీ దగ్గర్లో వున్న ఒక మంచి హోటల్‌కు తీసుకెళ్లి, ఆమె భోజనం పెట్టించింది.

ఇద్దర్నీ తీసుకుని, ఎలక్ట్రిక్ ట్రైన్ ఎక్కింది. ట్రైన్ వెళ్తూనే వుందిగాని, తాము ఎక్కడికి వెళ్తున్నారో వాళ్లిద్దరికీ ఏమీ తెలియడంలేదు. ఆ ఊళ్ళ పేర్లన్నీ ఆంగ్లంలోనూ, వేరేవో భాషల్లోనూ రాసి వున్నాయి. కొన్ని స్టేషన్లు దాటిన తర్వాత, ఒక స్టేషన్‌లో బండి ఆగగానే, ఇద్దర్నీ తొందరగా దింపి, తనూ దిగింది ఆమె.

ముగ్గురూ కలిసి అలా అలా బజార్లలోంచి నడుస్తూ వెళ్లి, ఒక పెద్ద "భవనం" చేరుకున్నారు. అది 'దివ్య భవనం'లా వున్నది. తామెప్పుడూ బొమ్మల్లో కూడా అలాంటి భవనం చూడలేదు! ముగ్గురూ లిఫ్ట్‌లో ఎక్కి నాలుగో అంతస్తుకి వెళ్ళారు. అక్కడంతా చీకటిగానూ, దుమ్ముదుమ్ముగానూ వుంది. పక్కన వున్న ఒక ఫ్లాట్‌లోకి ఇద్దరూ ఆహ్వానింపబడ్డారు. ఆ ఫ్లాట్‌లో వున్న ఆమెతో – ఈమె ఏదో హిందీలో మాట్లాడింది. ఇద్దర్నీ లోపలికి పంపింది. తాము ఎందుకు అక్కడికి వచ్చిందీ, వాళ్ళెందుకలా తమకు

**జి. అరుణ**

"సంగీత కచేరీలు" అనగానే మనం తరుచుగా శాస్త్రీయ సంగీత కచేరీలనో, లలిత సంగీత కచేరీలనో అభిప్రాయపడుతూ వుంటాం. అయితే, సినిమా పాటలు బహుళ ప్రచారంలోకి వచ్చి, సామాన్య జనాన్ని అమితంగా ఆకట్టుకొనటం మొదలయాక, ఆ పాటలను ప్రక్క వాద్య సంగీతంతో కూడా అదే విధంగా పాడి వినిపించే కచేరీలు – "ఆర్కెష్ట్రా"ల పేరుతో తయారై గత ఇరవై సంవత్సరాలుగా రాష్ట్రమంతటా బహుళ ప్రచారంలోకి వచ్చాయి. ఈ సినీ సంగీత కచేరీలకు సినిమాలలో మాదిరిగా ఎక్కువ వాద్య విశేషాలను—అంటే, మామూలుగా వుండే ఫిడేళ్లు, హార్మోనియం, తబలాలే గాక క్లారినెట్, గిటార్, మాండొలిన్, అకార్డియన్, డ్రమ్స్, బాంగోస్ వగైరాలను—ఉపయోగించి యీ కచేరీలలో విని పిస్తున్నారు. ఈ రకమైన ఆర్కెష్ట్రాలు మన రాష్ట్రంలో యించుమించుగా ప్రతి పట్టణంలోనూ, అక్కడక్కడ పల్లెపట్టులలో కూడా తయారై, అతి తరుచుగా ప్రోగ్రాములు యివ్వటం జరుగుతోంది.



అనేకమంది గాయకులు, గాయనీమణులు, వాద్య కళాకారులు యీ కచేరీలలో పాల్గొంటున్నారు.

శ్రీమతి జి. అరుణ అటువంటి ఒక గాత్ర కళాకారిణి! విశాఖపట్నం వాస్తవ్యురాలు. తన పదవ సంవత్సరం నుండి పాటలు పాడుతూ యిప్పటికి కొన్ని వందల ప్రోగ్రాములలో పాల్గొన్నారు. తాను ఒక్కతెగా అఖిల భారత సప్తమ "హేండి క్రాఫ్ట్స్" ప్రదర్శనలోను, అనకాపల్లిలో జరిగిన విశాఖ జిల్లా నాటక పోటీల సందర్భంలోను, డిస్ట్రిక్టు ఇంటర్ స్కూల్స్ అథ్లెటిక్ అసోసియేషన్ లోను, శ్రీకాకుళంలో జరిగిన కో-ఆపరేటివ్ వారోత్సవాలలోను పాడి అనేక బహుమతుల్ని అందుకున్నారు.

మొట్టమొదటగా కొంతకాలం పాటు శ్రీకాకుళం సుకుమార్ ఆర్కెష్ట్రా బృందంలో తన సోదరుడు శ్రీ బండారు విన్సెంట్‌తో కలిసి పాడుతూ అనేక ప్రోగ్రాములలో పాల్గొన్నారు. తరువాత విశాఖ "నవయుగ" ఆర్కెష్ట్రా బృందంలో చేరి అనేక ప్రోగ్రాములలో పాల్గొన్నారు. సినీ ప్లేబాక్ గాయకుడు శ్రీ ఆనంద్‌తో కలిసి అనేకసార్లు పాడారు. మన రాష్ట్రంలోనే గాక ఒరిస్సాలో మహారాష్ట్రలో కూడా అనేక కచేరీలలో పాల్గొన్నారు.

అరుణ–యునైటెడ్ ఆర్ట్స్ అకాడమీ సభ్యురాలు. ఈ మధ్యనే ఆంధ్రప్రదేశ్ రంగస్థల వృత్తి కళాకారుల సమాఖ్య అధ్వర్యంలో "అరుణరాగ నిలయం" అనే పేరుతొ తనదంటూ ఒక బృందాన్ని నెలకొల్పారు. ఈ బృందం నిర్వహించే కార్యక్రమాల ద్వారా తాను సమాఖ్యకు, సమాజానికి సేవ చేయగలనని అన్నారు.

శ్రీమతి అరుణ భర్త శ్రీ గార అప్పారావు రైల్వే ఉద్యోగి. వారికి ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు సంతానం.

—విలేకరి

---

'మర్యాద' చేసిందీ, రాణికేమీ అర్థం కాలేదు. ఆమె దృష్టి, ఆలోచన అంతా బొంబాయి మహానగరం మీదనే వుంది.

ఒక రాత్రివేళ, రాణి ఒక్కతే గదిలో కూచుని ఆలోచిస్తూ వుండగా, ఒక అతను వచ్చాడు. తాగిన వాసనతో కళ్ళు నములుతూ వింతగా చూస్తూ వచ్చాడు అతను. ఒక్క క్షణం రాణికి ఏమీ అర్థం కాక పోయినా మరుక్షణంలో అర్థమైంది. తాను ఎలాంటి చోటు కొచ్చిందీ, అతను ఎందుకొచ్చిందీ ఆమె అర్థం చేసుకునే లోపలే–అతను ఆమెను బలంగా లొంగదీసుకున్నాడు. ఆమె ఎంత పెనుగులాడినా, కేకలు వేసినా లాభం లేకపోయింది!....

పదిహేను ఏళ్ళు దాటని వయసులోనే రాణి— 'మరో జీవితం' ఆరంభించింది! తన శరీరాన్ని లొంగదీసుకున్న వాళ్ళు పారేసిన డబ్బుతో, జీవితాన్ని నెట్టుకురావలసి వచ్చింది. ఆమె ఆరోగ్యం కూడా పాడయింది; ఆమెకు సుఖరోగాలు అంటుకున్నాయి.

అయితే, కొద్దికాలపు 'నరకం' అనంతరం ఆమెకు అక్కడి నుంచి 'విముక్తి' లభించింది. ఒక రోజు పోలీస్‌వాళ్ళు ఆ ఇంటి మీద దాడి చెయ్యడంతో, తన గోడంతా వాళ్ళకి ఆమె చెప్పుకోగలిగింది. పోలీసులు ఆమెను సంరక్షక గృహానికి చేర్చారు.

పాపం రాణి! పండంటి తన జీవితాన్ని, చిన్న వయసులోనే 'నరకం' చేసుకుని, పడరాని కష్టాలతో గట్టెక్కించవలసి వచ్చింది....

రాణి–తన తలిదండ్రులకు ఒక్కతే సంతానం కావడం, దానివల్ల అతి గారాబంగా పెరగడం— ముందుగా ఏర్పడిన ముప్పు. సాధారణంగా ఈ తప్పు తలిదండ్రులది. ఒక్కతే పిల్ల అన్న ముద్దు చేత, ఆమెను ఎంతో ముద్దుగా పెంచుతున్నామనుకుని పూర్తిగా నిర్లక్ష్యం చేసి, ఆమె జీవితం పాడు చేస్తారు. అలాంటి పిల్లలకి అహంకారం పెరుగుతుంది; అలక్ష్యం పెరుగుతుంది! మంచి చెడ్డల విచక్షణ తెలుసుకోకుండా, తాము పట్టుకున్న కుందేలుకు మూడే కాళ్ళనుకుంటారు.

రాణి విషయంలో అదే జరిగింది. తెలిసీ తెలియని జ్ఞానంలోనే 'ప్రేమ'లోపడి, ఒక కుర్రాడితో పారిపోయింది. అక్కడ కూడా ఆమెకు బాగు లేదు. 'అతనితో కలిసి వుండడంలో తృప్తి కనిపించలేదు. అతనితో అలా వెళ్ళిపోయినా, ఏదోగా కలిసి మెలిసి వున్నా ఆమె జీవితం బాగానే గడిచి పోయేది. కాని, అక్కడ ఆమె రాజీపడలేక పోయింది; ఆ జీవితంతో సర్దుకోలేకపోయింది. ఇంకా ఏదో స్వర్గం లాంటి జీవితం కోసం అర్రులు చాచింది. అలాగే, తెలిసీతెలియని తనంలోనే బొంబాయి పరుగెత్తింది. అక్కడ బావుకున్నదేమీ లేదు–'వ్యభిచారిణి'గా మారవలసి వచ్చింది!

ఇవాళ సంరక్షక గృహంలో-ఏదో పనిపాటా చేసుకుంటున్న రాణి, ఇప్పుడు విచారించి లాభం ఏమిటి? – తను తలిదండ్రుల్ని అలక్ష్యం చేసింది. తన కోరికలే తనకి రక్ష అనుకుంది, అలాగే, ఆ తలిదండ్రులూ, రాణిని ఇష్టం వచ్చినట్టు వదిలి పెట్టేశారు; తాము ఆమెను గారాబం చేస్తున్నామన్న విషయం గుర్తించకుండా ఆమె జీవితాన్ని పాడు చేశారు. అందుకే తల్లిదండ్రులు ఎంతో బాధ్యతాయుతంగా, ఎంతో జాగ్రత్తగా వుండాలి. తాము తమ బిడ్డల్ని ఎలా పెంచుతున్నాము? వాళ్ళు ఎలా పెరుగుతున్నారు? – అన్న ఆలోచన అనుక్షణం వుండాలి. అలా చూసుకోడానికి కొంత సంస్కారం వుండాలి. ఆ సంస్కారం వాళ్ళకి లేకపోతే, సంపాయించుకోవాలి; నేర్చుకోవాలి. లేకపోతే– ఆ పిల్లల జీవితాలూ పాడయిపోతాయి; అవి చూడలేక తమ జీవితాలూ ఎండిపోతాయి!

—కమలాకుమార్